# ఇంటర్నెట్ ఆవిష్కరణతో మానవ జీవితాల్లో విప్లవాత్మక మార్పులు !

ప్రపంచం కుగ్రామం అయ్యింది. అర చేతిలో వైకుంఠం వెలిసింది. దూరాలు సమసిపోయాయి. సరిహ ద్దులు రేఖలుగా మారి పోయాయి. ప్రపంచం అంతర్జాల వలయంలో ఊగి తూగుతోంది. ఇంటర్నేట్ సంటోడి వరకు చేరింది. ఇణటర్నెట్ వాడకుండా క్షణం గడవడం లేదు. క్షణాల్లో మనం పంపించిన సమాచారం మిలియన్ల ప్రజలకు చేరుతున్నది. మహా సముద్రమంత సమాచారం బుల్లి స్మార్ట్‌ఫోన్ చిప్‌లో నిక్షిప్తం అయ్యింది. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లాలన్నా గూగులమ్మ దారి చూపుతోంది. ప్రపంచ ప్రజలను వీడియో, ఆడియో కాల్స్ క్షణాల్లో కలుపుతోంది. మనం ఎక్కడ దాక్కున్నా దొరికి పోతున్నాం. సమాచార వితరణ సరళమై పోయింది. వరల్డ్ వైడ్ వెబ్, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ ఊయల్లో డిజిటల్ యుగ నరుడు పరవసిస్తూ ప్రయాణం చేస్తున్నాడు. ఆర్థిక లావాదేవీలకు స్మార్ట్‌ఫోన్ వేదికయ్యింది. సమాచార వితరణ వాయు వేగాన్ని అధిగమిస్తున్నది. అంతర్జాల వలలో తనకు తెలి యకుండానే మనిషి చిక్కుకుపో తున్నా డు. నెట్‌ను వదిలి మనిషి బ్రతకలేని విచిత్ర (దు)స్థితి వచ్చి పడింది. టచ్ స్క్రీన్ తాకితే మాయా ప్రపంచ పోకడలు, విశ్వ విడ్డూరాలు, అంతర్జాల రహస్యాలు కళ్ల ముందు కదలాడు తున్నాయి. ప్రపంచ మార్కె టింగ్ అంతా కొన వేళ్లతో క్షణాల్లో నెట్టింట్లోనే పూర్తి అవుతున్నది. డిజిటల్ కరెన్సీ రాజ్యమేలుతున్నది. అన్నీ అనుభవిస్తున్న అంతర్జాల విని యో గదారులు ప్రతి ఏట 01 ఆగష్టున "వరల్డ్ వైడ్ వెబ్ దినోత్స వాన్ని" ఘనంగా నిర్వహించుకుంటూ ఆవిష్కర్తల కృషికి జేజేలు పలుకుతున్నారు.

విలాసం నుంచి నిత్యావసరం వరకు:

మానవ చరిత్రలో అత్యంత ప్రయోజనకర ఆవిష్కరణల్లో వరల్డ్ వైడ్ వెబ్(డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ) అతి ప్రధానమైనదిగా గుర్తించబడింది. 1989లో "టిమ్ బర్నర్-లీ" వరల్డ్ వైడ్ వెబ్ ప్రక్రియను కనుగొని 1991లో పరిశోధన ఫలితాలను ప్రచురించారు. కంప్యూటర్ సైంటిస్ట్ అయిన టిమ్ బర్నర్-లీ తొలి సారి 1992లో వరల్డ్ వైడ్ వెబ్, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ మాధ్యమంగా ఒక ఫోటోను దిగ్విజయంగా అప్‌లోడ్ చేయడం జరిగింది. టిమ్ బర్నర్-లీ, రాబర్ట్ కైలియన్‌లు కలిసి "హైపర్ టెక్స్ట్ ట్రాన్స్‌ఫర్ ప్రోటోకాల్ (హెచ్‌టిటిపి)"ని అభివృద్ధి చేసి 1992లో విడుదల చేశారు. 1995లో "ఇంటర్నేట్ ఎక్స్‌ప్లోరర్" దూసుకొచ్చింది. 2004లో "ఫేస్‌బుక్" ప్రారంభమైంది. తొలి దశలో అత్యంత ఖరీదైన అంతర్జాల సౌకర్యం అనతి కాలంలోనే కోట్ల సామాన్య మానవాళికి చవకైన నిత్యవసరం అయ్యింది. నేడు స్మార్ట్‌ఫోన్లతో పాటు ఐప్యాడ్స్, ల్యాబ్‌టాప్స్, స్మార్ట్ వాచెస్, గేమింగ్ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మార్కెట్‌ను ముంచెత్తడం వింతగా చూ స్తున్నాం. అంతర్జాల కనీస అక్షరాస్యత లేని పౌరుడు కనిపిం చడంతో లేదు. వస్తు, సేవా రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. నేటి ఆవిష్కరణ రేపటికి పాతబడి పోతున్నది. వరల్డ్ వైడ్ వెబ్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఆవిష్కరణతో మానవాళి జీవనశైలిలో వచ్చిన మార్పులు ఊహకు అందడం లేదు.

వెబ్ విప్లవ చరిత్ర:

1992లో 'జీన్ ఆర్మర్ పాల్' చొరవతో 'సర్ఫింగ్ ది ఇంటర్నెట్' అనే పదం ఉద్భవించింది. 1993లో "మొసాయిక్ వెబ్ బ్రౌజర్" కనుగొన బడింది. 1994లో వాణిజ్యపరంగా "వెబ్‌సైట్స్" ప్రారంభించారు. 1996లో "విండోస్ కంప్యూటర్ సిస్టమ్స్" వచ్చాయి. 1998లో "గూగుల్" ప్రవేశం, 2004లో "ఈ-మొబైల్స్" అందుబాటులోకి వచ్చాయి. 2020 తర్వాత "ఏఐ యుగం" వేగం పుంజుకొంది. 1994-99 మధ్య "వెబ్" వాణిజ్యపరంగా మారడం, 2000-04 మధ్య "డాట్-కామ్" రాకతో వెబ్ విప్లవం కొత్త పుంతలు తొక్కింది. 2004-10 మధ్య "సామాజిక మాధ్యమ విప్లవం" పెల్లుబికింది. 2010-15 మధ్య "మొబైల్ వెబ్", "యాప్ విప్లవం" వచ్చింది. 2015-21 మధ్య "క్లౌడ్ కంప్యూటింగ్" బయట పడింది. 2022 తర్వాత "వెబ్ 3.0 దశ" ప్రారంభమై నేడు "ఏఐ, చాట్‌జిపిటీ, బర్డ్" లాంటి ఏఐ యుగం నడుస్తోంది.

వరల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ) డే-2024:

నేటి వరల్డ్ వైడ్ వెబ్ మాధ్యమం గా వాణిజ్యం, విద్య, ఆర్థిక లావాదేవీ లు, సమాచారం, వినోదం, రిమోట్ వర్క్ లాంటివి మానవాళి జీవనశైలిని పూర్తిగా మార్చి వేశాయి. నేడు గూగుల్, యూట్యూబ్, ఫేస్‌బుక్, బైడు, వికీపీడియా అనబడే ఐదు బహుళ ప్రచారం పొందిన వెబ్‌సైట్స్ మన జేబులో దూరాయి. గూగుల్ పేజ్‌లో ఒక నిమిషానికి కనీసం 40,000 శోధనలు మించి జరుగుతు న్నాయి. వరల్డ్ వైడ్ వెబ్ రాక తర్వాత గత మూడు దశాబ్దాల్లో ఆధునిక మానవుడు ఊహకందని ప్రగతిని సాధించాడు. "ప్రపంచ వరల్డ్ వైడ్ వెబ్ దినం -2024" వేదికగా కొత్త యాప్‌లు/వెబ్‌సైట్లు ప్రయత్నించడం, బ్లాగ్‌లను ఏర్పాటు చేయడం, కోడింగ్ పరిజ్ఞానం పొందడం, వెబ్ డెవలపర్స్ సంఘాలు ఏర్పాటు చేయడం, ఇతరులకు మన వెబ్‌సైట్లను పరిచయం చేయడం లాంటి నవ్య కార్యక్రమాలు నిర్వహించ వచ్చని నిపుణులు సూచిస్తున్నారు. 01 ఆగష్టు 2024న 35వ వరల్డ్ వైడ్ వెబ్ ఆవిష్కరణ దినం పాటిస్తూ, అంతర్జాలాన్ని మానవ ప్రయోజనాలకు మాత్రమే వినియోగిద్దాం, ప్రపంచాభివృద్ధిలో భాగం అవుదాం. అం తర్జాలంతో అద్భుతాలు ఆవిష్కరిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# విశాఖ స్థానిక బరిలో బొత్స..

## -30న ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక
## -ఇప్పటికే షెడ్యూల్ విడుదల
## -13 నుంచి నామినేషన్ల స్వీకరణ

అమరావతి, ఆగష్టు 2 :విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసీపీ నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ బరిలో దిగనున్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బొత్సను అభ్యర్థిగా



ప్రకటించారు. ఆ గస్ట్ 30నఈ ఎమ్మె?ల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఎక్స్ అఫీ షియో సభ్యులతో కలిపి మొత్తం 841 ఓట్లున్నాయి. ఇందులో వైసీపీకి 615, టీడీపీకి 215 ఓట్లు, 11 ఖాళీలున్నాయి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన నామినేషన్లను ఆగస్ట్ 13 వరకూ స్వీకరించనున్నారు.

కాగా, తాడేపల్లిలోని తన కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతలతో వైసీపీ అధినేత జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెజారిటీ సభ్యులు బొత్సను అభ్యర్థిగా నిలబెడితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేయడంతో వైసీపీ అధినేత జగన్ బొత్సను అభ్యర్థిగా ప్రకటించారు . విశాఖ జిల్లా స్థానిక సంస్థల్లో వైయస్సార్‌సీపీకి భారీ మెజార్టీ ఉన్న నేపథ్యంలో సహజంగా టీడీపీ పోటీకి పెట్టకూడదని, కాని చంద్రబాబు ఏరోజూ నైతిక విలువలు పాటించే వ్యక్తి కాదని జగన్ అన్నారు. రకరకాల ప్రలోభాలు, బెదిరింపులతో అడ్డగోలుగా గెలవడానికి ప్రయత్నిస్తారన్నారు. కుయుక్తులు, కుట్రలు అనేవి చంద్రబాబు నైజం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఉన్నిక జరగబోతోందని, అందుకే పార్టీలో అందరు నాయకుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలని జగన్ కోరారు. సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని నిర్దేశించారు. అధికార పార్టీ నుంచి బెదిరింపులు ఉంటాయని, వాటిని ధీటుగా ఎదుర్కొనేలా అందరూ కలిసి ముందుకు సాగాలని అన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న వంశీ కృష్ణ యాదవ్ ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందడంతో విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్సను అభ్యర్థిగా జగన్ ప్రకటించడంతో ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. . అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా వైసిపి, టిడిపి కూటమి మధ్య ఎన్నికల ఫైట్ జరగనుంది.

# 'ఒక దేశం, ఒక ఎన్నిక' పై ఏర్పాటైన బృందం సిఫారసులు

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :దేశంలో ఏక కాలంలో ఎన్నికలను నిర్వహించాలనే విషయంపై ఒక ఉన్నతస్థాయి సంఘాన్ని (హెచ్‌ఎల్ సి ని) భారతదేశ పూర్వ రాష్ట్రపతి శ్రీ రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు 2023 సెప్టెంబరు 2న గజిట్ నోటిఫికేషన్ లో తెలిపింది. ఈ కమిటీ రాజకీయ పక్షాలతో పాటు సంబంధిత వివిధ వర్గాల నుంచి సూచనలను, సలహాలను, ఆలోచనలను ఆహ్వానించిన అనంతరం తన నివేదికను 2024 మార్చి నెల 14న ఇచ్చింది. భారతదేశ పూర్వ ప్రధాన న్యాయమూర్తులను, ఉన్నత న్యాయస్థానాల పూర్వ ప్రధాన న్యాయమూర్తులను, భారతదేశ ఎన్నికల సంఘం పూర్వ ప్రధానాధికారులను, రాష్ట్రాల ఎన్నికల సంఘం ప్రధానాధికారులు సహా న్యాయ శాస్త్ర నిపుణులను కూడా సంఘంతో స్వయంగా మాటామంతీ జరపడానికి ఆహ్వానించడమైంది. లా కమిషన్ ఆఫ్ ఇండియా వంటి నిపుణుల సంస్థలను కూడా ఈ సంఘం ఆహ్వానించింది. పౌరులు, సంస్థల వద్ద నుంచి సూచనలను, సలహాలను, వ్యాఖ్యలను కోరడానికి వార్తాపత్రికలలో, సామాజిక మాధ్యమాలలో ఒక బహిరంగ ప్రకటనను జారీ చేయడమైంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తో పాటు భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), భారతీయ వాణిజ్య, పరిశ్రమల మండలుల సమాఖ్య (ఎఫ్ఐసిసిఐ..'ఫిక్కి'), అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (ఎఎస్ఎస్ఒసిహెచ్ ఎఎమ్..'అసోచామ్') ల వంటి ప్రధాన వ్యాపార సంస్థలకు కూడా వాటి అభిప్రాయాలను తెలియజేసేందుకు అవకాశాలను ఇవ్వడం జరిగింది. దేశంలో ప్రముఖ ఆర్థికవేత్తలు కూడా సంఘంతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలియజేశారు. సంఘం 65 సమావేశాలను నిర్వహించింది. ఆ తరువాత విస్తృత చర్చోపచర్చలు జరిపి, తన సిఫారసులను ప్రభుత్వానికి సమర్పించింది.

# అల్యూమినియమ్ ఉత్పత్తిలో ప్రపంచంలో రెండో అతి పెద్ద దేశంగా భారతదేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :దేశంలో కీలక ఖనిజాల ఉత్పత్తి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలకు చేరుకొన్న అనంతరం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు నెలల్లో కూడా పటిష్ట వృద్ధిని కొనసాగించింది. మొత్తం ఎమ్‌సిడిఆర్ ఖనిజాల ఉత్పత్తిలో విలువ పరంగా చూసినప్పుడు ఒక్క ఇనుప ముడి ఖనిజం, సున్నపురాయి లే దాదాపుగా 80 శాతం విలువ ను ప్రతిబింబించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇనుప ముడిఖనిజం ఉత్పత్తి 275 మిలియన్ మెట్రిక్ టన్నులు (ఎమ్ఎమ్‌టి)గా, సున్నపురాయి ఉత్పత్తి 450 ఎమ్ఎమ్‌టి గా ఉండింది.

తాత్కాలిక సమాచారాన్ని పట్టి చూస్తే, 2024-25 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్) లో లోపేతర ధాతు (నాన్-ఫెరస్ మెటల్) రంగంలో ప్రాథమిక అల్యూమినియమ్ ఉత్పత్తి అంతకు ముందు సంవత్సరం ఇదే కాలం కన్నా 1.2 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్) లో 10.28 లక్షల టన్నులుగా ఉన్నది కాస్తా 2024-25 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్) లో 10.43 లక్షల టన్నుల (ఎల్‌టి) కు పెరిగింది.

ప్రపంచంలో భారతదేశం రెండో అతి పెద్ద అల్యూమినియమ్ ఉత్పత్తిదారుగాను, మూడో అతి పెద్ద సున్నం ఉత్పత్తిదారుగాను, నాలుగో అతిపెద్ద ఇనుప ముడిఖనిజం ఉత్పత్తిదారు దేశంగాను ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇనుప ముడిఖనిజం, సున్నపురాయిల ఉత్పత్తిలో నిరంతర వృద్ధి ఉక్కు పరిశ్రమ, సిమెంటు పరిశ్రమలల వంటి ఉపయోగకర్త పరిశ్రమల్లో గిరాకీ చాలా బలంగా ఉందని సూచిస్తోంది. వీటికి అల్యూమినియంలో వృద్ధిని కూడా కలిపితే, ఈ వృద్ధి ధోరణులు శక్తి (ఎనర్జీ), మౌలిక సదుపాయాలు, నిర్మాణం, ఆటోమోటివ్, మెషినరీ వంటి ఉపయోగకర్త రంగాలలో ఆర్థిక కార్యకలాపాల తీరు పటిష్టంగా ఉందన్న సంకేతాలను ఇస్తున్నాయి.

ఇనుప ముడిఖనిజం ఉత్పత్తి 2023-24 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్ మధ్య కాలం) లోని 72 ఎమ్ఎమ్‌టి స్థాయి నుంచి 9.7 శాతం వృద్ధి తో 2024-25 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్ మధ్య)లో 79 ఎమ్ఎమ్‌టి కి పెరిగింది. సున్నపురాయి ఉత్పత్తి 2023-24 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్ మధ్యకాలం)లోని 114 ఎమ్ఎమ్‌టి స్థాయి నుంచి 1.8 శాతం మేర వృద్ధి చెంది, 2024-25 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్ మధ్యకాలం)లో 116 ఎమ్ఎమ్‌టి కి చేరుకొంది. మాంగనీస్ ఖనిజం ఉత్పత్తి 2024-25 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జూన్ మధ్యకాలం)లో, అంతకు ముందు సంవత్సరం అదే కాలంలోని 0.9 ఎమ్ఎమ్‌టి కన్నా 11 శాతం అధికంగా 1.0 ఎమ్ఎమ్‌టి కి చేరింది.

# గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల విధానం

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :కంద్ర రంగ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇఎంఆర్ ఎస్) పథకాన్ని నిర్వహించడానికి, అమలు చేయడానికి గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (నెస్ట్స్) నివేదించిన ప్రకారం, ఇఎంఆర్ ఎస్ కోసం బోధన, బోధనేతర సిబ్బంది కేంద్రీకృత నియామకం విజయవంతంగా పూర్తయింది.

నియామక పరీక్షలో హిందీ భాషపై పరీక్ష అర్హత స్వభావం కలిగి ఉంది. నెస్ట్స్ నివేదించిన ప్రకారం , పోస్టింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎంపికైన అభ్యర్థులను ఆయా రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల లభ్యతకు లోబడి వీలైనంత వరకు వారి స్వరాష్ట్రాల్లో నియమించామని నెస్ట్స్ తెలిపింది. స్థానిక భాషల పరిజ్ఞానానికి సంబంధించి అభ్యర్థులకు రాష్ట్ర విద్యా సొసైటీల ద్వారా స్థానిక భాషలపై సెషన్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

2022-23 నుంచి 2026-27 నాటికి దశలవారీగా ఈ పోస్టులను భర్తీ చేయాలనే సలహాతో దేశవ్యాప్తంగా అన్ని ఇఎంఆర్ ఎస్ లకు 38,480 టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను సృష్టించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం నెస్ట్స్ 2023లో సెంట్రలైజ్డ్ రిక్రూట్మెంట్ ను ప్రారంభించింది. ప్రస్తుతం 8 వేలకు పైగా నియామక ఉత్తర్వులను నెస్ట్స్ జారీ చేసింది.

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే ఈ రోజు లోక్ సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలు తెలిపారు.

# చిన్న, మధ్యతరహా నగరాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డబ్ల్యూ నిబంధనల ప్రకారం ఏడు, పన్నెండో షెడ్యూళ్లలోని పట్టణాభివృద్ధికి సంబంధించిన అంశాలు రాష్ట్రాలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలోకి వస్తాయి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వారి పట్టణాభివృద్ధి ఎజెండాలోని కార్యక్రమాలకు గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తమ ప్రధాన పథకాల ద్వారా మద్దతు ఇస్తుంది. జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ లో భాగమైన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ స్కీమ్ ఫర్ స్మాల్ అండ్ మీడియం టౌన్స్ (యూఐడీఎస్ఎస్ఎంటీ) 31 మార్చి 2014 వ తేదీన ముగిసింది. 31 మార్చి 2014 నాటికి 50% లేదా అంతకంటే ఎక్కువ కేంద్ర సహాయం అందుకున్న లేదా పురోగతి 50% లేదా అంతకంటే ఎక్కువ ఉన్న లేదా మిషన్ యొక్క పరివర్తన దశలో మంజూరు చేయబడిన యుఐడిఎస్ఎస్ఎంటి కి చెందిన అన్ని ప్రాజెక్టులకు 31 మార్చి 2017 వరకు 'అమృత్' కింద నిధుల కోసం ఆమోదం లభించింది.

ఈ కాలపరిమితి కూడా ముగుస్తున్న నేపథ్యంలో, అన్ని ప్రాజెక్టులను ఆయా రాష్ట్రాలకు అప్పగించారు.

మంత్రిత్వ శాఖ అటల్ మిషన్ ఫర్ రిజువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ 2.0 (అమృత్ 2.0), స్మార్ట్ సిటీస్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్-పట్టణ 2.0 వంటి ఇతర పథకాల ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయం చేస్తుంది. కేంద్ర సహాయం నగరాలకు కాకుండా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మంజూరు అవుతుంది. మిషన్, పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ పథకాలను అమలు చేస్తాయి.

స్మార్ట్ సిటీస్ మిషన్ కింద 100 నగరాలను ఎంపిక చేయగా, అందులో 66 నగరాల్లో 10 లక్షల లోపు జనాభా ఉంది. ఇందులో లక్ష లోపు జనాభా ఉన్న నగరాలు 12, అదేవిధంగా 1-5 లక్షల మధ్య జనాభా ఉన్న 33 నగరాలు కాగా, 5-10 లక్షల మధ్య జనాభా ఉన్న 21 నగరాలు (2011 జనాభా లెక్కల ప్రకారం) ఉన్నాయి. ఈ 66 నగరాలకు రూ.29,693 కోట్ల కేంద్ర నిధులను విడుదల చేశారు. ఈ నగరాల్లో రూ.91,143 కోట్లతో మొత్తం 5,162 ప్రాజెక్టులు చేపట్టారు. వీటిలో రూ.76,735 కోట్ల విలువైన 4,548 ప్రాజెక్టులు (మొత్తం ప్రాజెక్టుల్లో 84 శాతం) పూర్తయ్యాయి.

గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ తోఖాన్ సాహు నేడు లోక్ సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

# గుండుమలలో లబ్ధిదారులకు చంద్రబాబు పించన్లు పంపిణీ..



అమరావతి, ఆగష్టు 2 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిర మండలం గుండుమల గ్రామానికి వెళ్లారు. అక్కడ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియలో స్వయంగా పాల్గొన్నారు. గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తన చేతుల మీదుగా పెన్షన్ అందించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వితంతు మహిళ ఓబులమ్మ ఇంటికి వెళ్లిన చంద్రబాబు ఆమెకు పెన్షన్ అందజేశారు. తన ఇల్లు సరిగా లేదని ఓబులమ్మ చెప్పడంతో చంద్రబాబు వెంటనే స్పందించారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ను పిలిచి, ఇల్లు బాగు చేసి ఇవ్వాలని ఆదేశించారు.

ఏపీ వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ దాదాపు పూర్తయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా 96శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల ద్వారా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. సత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమలలో సీఎం చంద్రబాబు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛను డబ్బులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం 4గంటల సమయానికి 96శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు వెల్లడించారు. మిగిలిన నాలుగుశాతం పెన్షన్లు పంపిణీ చేసేలా సచివాలయ ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారు. అత్యధికంగా కృష్ణా జిల్లా, అత్యల్పంగా అల్లూరి జిల్లాలో పెన్షన్ల పంపిణీ జరిగింది.

వైసిపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. అవినీతి, విధ్వంసం, అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమలలో నిర్వహించిన ప్రజావేదికలో పింఛను లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజల ఆస్తులకు రక్షణగా ఉండాల్సిన వారే వైకాపా పాలనలో ఇష్టానుసారం దోపిడీ చేశారని విమర్శించారు. సర్వే రాళ్ల కోసం రూ.700 కోట్లు ఖర్చు చేసి వాటిపై కూడా ఫొటోలు వేయించుకున్నారని విమర్శించారు.

"ఐదేళ్లలో పేదలకు ఇళ్లు కట్టలేదు కానీ, రుషికొండలో ప్యాలెస్ కట్టారు. మేం పాలకులం కాదు.. సేవకులమని గుర్తించాలి. వాస్తవాలు తెలియాలని 7 శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజల ఆదాయం పెంచే కార్యక్రమాలు చేపడుతున్నాం. రాళ్ల సీమను రతనాల సీమగా చేసే బాధ్యత మాది. పట్టు పరిశ్రమతో మంచి ఆదాయం.. ఉపాధి కల్పన. తెదేపా హయాంలో సాగునీటికి రూ.68వేల కోట్లు ఖర్చు చేశాం. కరవు జిల్లాలో కియా మోటార్స్ తీసుకొచ్చాం. పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానిస్తే కరవు ఉండదు. అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. పంటలకు గిట్టుబాటు ధరకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ అందుబాటులోకి తెస్తాం. మడకశిరలో రూ.60 కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మిస్తాం. ఈ ప్రాంతంలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తాం. పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పిస్తాం. పేదలందరికీ ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.4లక్షల ఆర్థిక సాయం చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద..

కర్నూలు ఆగష్టు 2 : శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతుంది. దీంతో డ్యాంలో కనిష్ట స్థాయిలో నీటి నిల్వలు చేసుకుని 10 గేట్లను 18 అడుగుల మేర ఎత్తి ఇరిగేషన్ అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం ఉదయం డ్యాంకు వస్తున్న నీటి ప్రవాహం, విడుదలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీశైల జలాశయంకు ఇన్ ఫ్లో 4,82,401, ఔట్ ఫ్లో 4,42,977 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు.. ప్రస్తుత నీటిమట్టం 883.50 అడుగులు..

జలాశయంలో పూర్తిస్థాయి నీటి నిలువలు 215 టీఎంసీలకు గానూ, 207.410 పీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఇక జలాశయంకు జూరాల స్పిల్ వే నుంచి 303180, విద్యుత్ కేంద్రం నుంచి 18,223, సుంకేసుల బ్యారేజ్ నుంచి 1,60,998 క్యూసెక్కుల నీటి ప్రవాహం చేరుతుంది. కుడి, ఎడమ కేంద్రాల్లో జల విద్యుత్ ఉత్పత్తి ముమ్మరంగా సాగుతుంది. ఇందులో ఏపీ విద్యుత్ కేంద్రం నుంచి 23,977 క్యూసెక్కుల నీటితో 14.159 మెగావాట్లు, తెలంగాణ ఎడమ విద్యుత్ కేంద్రం నుంచి 37,080 క్యూసెక్కుల నీటిని వినియోగించి 17.732 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.వీటితో పాటు ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్ కు 253, పోతిరెడ్డిపాడుకు 25000, తెలంగాణ లోని కల్వకుర్తికి 1600 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. ఇక శ్రీశైలం జలాశయంకు చెందిన పది గేట్ల నుంచి 4.67 లక్షల క్యూసెక్కుల నీరు దిగువ సాగర్ కు వెళుతుంది.

# లింగాలగట్టు సమీపంలో.. నీటిలో ఒకరు గల్లంతు

కర్నూల్ ,ఆగష్టు 2 : శ్రీశైలం డ్యాం వంతెన సమీపంలో కృష్ణాలో ఒకరు గల్లంతైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శ్రీశైలం డ్యాం దిగువ భాగాన లింగాలగట్టు పెద్దవంతన సమీపంలో ఈతకొడుతూ వ్యక్తి నదిలో గల్లంతయ్యారు. అందరు చూస్తుండగానే వ్యక్తి నీటిలో కొట్టుకపోవడం గమనార్హం.

గల్లంతైన వ్యక్తి నల్గొండ జిల్లా పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన యాదయ్య (48) గా గుర్తించారు. శ్రీశైలం భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు స్నేహితులతో కలిసి శ్రీశైలం వచ్చారు. ఈ క్రమంలో ఈతకొడుతూ నీటిలో గల్లంతయ్యారు. తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అమరావతికి మంచి రోజులు.. కట్టడాలను పరిశీలించనున్న నిపుణుల బృందం

అమరావతి, ఆగష్టు 2 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే రాజధాని అమరావతికి జవసత్వాలు వచ్చాయి. రాజధాని అమరావతిని ప్రపంచం గుర్తించేలా తీర్చి దిద్దుతామని, ఈ ఐదేళ్ళలో రాజధాని అమరావతి సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పిన విషయం తెలిసిందే.

ఇందులో భాగంగానే రాజధాని అమరావతిపై వడివడిగా అడుగులు వేస్తున్న చంద్రబు సర్కార్ గత టీడీపీ పాలనలో అసంపూర్ణంగా నిలిచిపోయిన కట్టడాల పరిస్థితిని అధ్యయనం చేసి వాటి నిర్మాణంలో ఎలా ముందుకు వెళ్ళాలి అన్నదానిపై ఐఐటీ నిపుణుల బృందంతో అధ్యయనం చేయించి వారి సూచనల మేరకు పనులు నిర్వహించాలని భావిస్తుంది.

దీంతో అమరావతిలో అసంపూర్తిగా నిలిచిన కట్టడాల సామర్ధ్యాన్ని అధ్యయనం చేసేందుకు ఐఐటి నిపుణులు నేడు, రేపు అమరావతిలో పర్యటించనుంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్ ల నుంచి ఇద్దరేసి ఇంజినీర్ల బృందాలు రానున్నాయి. రెండు బృందాలు రెండు రోజులపాటు అమరావతిలో పర్యటించి ఆయా కట్టడాలను పరిశీలించి వాటి నాణ్యత,సామర్థ్యాన్ని అంచనా వేయనున్నాయి. ఇక ఈ పర్యటన లో భాగంగా సీఆర్డీయే అధికారులతో రెండు బృందాల్లోని ఇంజినీర్లు విడివిడిగా సమావేశం కానున్నారు. రాజధాని నిర్మాణాల విషయంలో ఎలా ముందుకు వెళ్ళాలో వీరు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

నాటి టీడీపీ ప్రభుత్వం సెక్రటేరియట్, హెచ్ వోడి కార్యాలయాల టవర్లతో పాటు హై కోర్టు భవనాన్ని ఐకానిక్ కట్టడాలుగా నిర్మించేలా పనులు మొదలు పెట్టింది. అయితే 2019 ఎన్నికల్లో అధికారం పోగొట్టుకోవటంతో ఆ నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. భారీ ఫౌండేషన్ లతో పునాదులు వేసిన చాలా చోట్ల పునాదుల దశలోనే ఆయా నిర్మాణాలు నిలిచిపోయాయి. కొన్ని ఫౌండేషన్లు నీళ్ళలో ఉండిపోయాయి. భవనాల ఫౌండేషన్ సామర్థ్యాన్ని పరిశీలించే బాధ్యతను ఐఐటీ మద్రాస్ కు అప్పగించింది ఏపీ ప్రభుత్వం.. ఇక ఐఏఎస్ అధికారుల నివాసాలు,మంత్రులు,ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల క్వార్టర్ల నాణ్యతను అంచనా వేసే బాధ్యతను హైదరాబాద్ ఐఐటీకి అప్పగించింది ప్రభుత్వం.

# ఆస్పరి సమీపంలో వాహనం బోల్తా.. ఒకరి మృతి

కర్నూల్ ,ఆగష్టు 2 : కర్నూలు జిల్లా ఆస్పరి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ వాహనం బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

నంద్యాలకు చెందిన కొందరు ఆలూరు మీదుగా కర్ణాటకలోని కంపెనీకి వెళ్తుండగా ఆస్పరి సమీపంలో వారు వెళ్తున్న వాహనం బోల్తా పడింది. దీంతో వాహనంలోని ఓ వ్యక్తి మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ధరల పర్యవేక్షణ వ్యవస్థ (పి.ఎమ్.ఎస్) మొబైల్ యాప్ 4.0 వర్షన్ ప్రారంభించిన ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల శాఖ 2024, ఆగస్ట్ 1వ తేదీ నుండి అదనంగా 16 సరుకుల ను ధరల పర్యవేక్షణకు జోడించినట్లు, ఈరోజు ధరల పర్యవేక్షణ వ్యవస్థ (పి.ఎమ్.ఎస్.) మొబైల్ యాప్ యొక్క వర్షన్ 4.0 విడుదల సందర్భంగా వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ, కొత్త మరియు పునరుత్పాదక శక్తి శాఖామంత్రి శ్రీ ప్రహ్లాద్ వెంకటేష్ జోషి తెలిపారు. ఇప్పటికే 22 సరుకులు రోజువారీ ధరల పర్యవేక్షణ పరిధిలో ఉండగా, ఇప్పుడు మొత్తం 38 సరకుకుల ధరలు పర్యవేక్షించబడతాయి.

34 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 550 కేంద్రాల్లో గల ధరలను ఈ విభాగం పర్యవేక్షిస్తున్నది. విభాగం పర్యవేక్షించే ధరల డేటా ప్రభుత్వం, ఆర్.బి.ఐ., సి.పి.ఐ. ద్రవ్యోల్బణానికి సంబంధించిన విశ్లేషకులకు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం కోసం ముందస్తు సూచనలను అందిస్తుంది. మొత్తం సి.పి.ఐ. బరువులలో, 22 రకాల నరుకుల ద్వారా సంగ్రహించబడిన సి.పి.ఐ. బరువుల శాతం 26.5% తో పోల్చినప్పుడు 38 సరుకుల కోసం అది సుమారుగా 31% ఉంది. కొత్తగా చేర్చిన సరుకులలో సజ్జలు, జొన్నలు, రాగులు, రవ్వ (గోధుమ), మైదా (గోధుమ), శనగపిండి, నెయ్యి, వెన్న, వంకాయ, గ్రుడ్లు, నల్ల మిరియాలు, కొత్తిమీర, జీలకర్ర, ఎర్ర మిరప, పసుపు పొడి మరియు అరటిపండ్లు ఉన్నాయి.

రోజువారీ ధరల పర్యవేక్షణ పరిధిలోకి వచ్చే ఆహార పదార్థాల సంఖ్యలో పెరుగుదల ఆహార పదార్థాల ధరల అస్థిరతను స్థిరీకరించే, మొత్తం ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే విధానపరమైన ప్రక్రియలలో కీలక పాత్ర పోషిస్తుంది. వినియోగదారులకు అవసరమైన వస్తువుల లభ్యత, స్థోమత సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం మరింత ప్రతిబింబిస్తుంది.

ఆహార ధరల ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు భారత ప్రభుత్వం ఇటీవలి కాలంలో వరుస చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా రూ. 60లకే కిలోగ్రామ్ భారత్ శనగలు; రూ. 27.50లకే కిలోగ్రామ్ భారత్ గోధుమపిండి; రూ.29లకే కిలోగ్రామ్ భారత్ బియ్యం రిటైల్ వినియోగదారులకు అందించబడుతున్నవి. 2024, జూలై 29వ తేదీ నుండి రిటైల్ వినియోగదారుల కోసం రూ.60లకే కిలో టమాటల రిటైల్ విక్రయాన్ని ఎన్.సి.సి.ఎఫ్. ప్రారంభించినది. అధిక మొత్తంలో నిల్వచేయుటను నివారించడానికి కంది, దేశీ శనగల నిల్వలపై 2024, జూన్ 21వ తేదీ నుండి 2024, సెప్టెంబర్ 30వ తేదీ వరకు పరిమితులు విధించబడినవి. దేశీయ సరఫరాను మెరుగుపరిచేందుకు కందులు, మినుములు, మసూర్, పసుపురంగు బఠానీ, దేశీయ శనగల దిగుమతిపై సుంకం రద్దు చేయబడినది. లభ్యత, స్థోమతను నిర్ధారించడానికి కొరత ఉండే నెలల్లో విడుదల చేయడం కోసం 5 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ సేకరించబడుతున్నది.

ఈ సంవత్సరం (2024-25) ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ధరల నియంత్రణ చర్యలు మార్కెట్‌ను స్థిరీకరించాయి అలాగే గత నెలతో పోల్చితే ప్రధాన మండీలలో శనగ, కంది, మినప పప్పుల ధరలు 4% వరకు తగ్గాయి. వారం వారీగా పప్పుదినుసుల కోసం అఖిల భారత సగటు రిటైల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో ఇటీవలి వారాల్లో మండీ ధరలలో నెలకొన్న తగ్గుదల ధోరణి ప్రస్తుత రిటైల్ ధరల్లో కనిపిస్తుంది.

# పట్టణ ప్రాంతాల్లో పేదలకోసం ఇళ్ల నిర్మాణం, కేటాయింపులు

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :భూములు, కాలనీల నిర్మాణం అనేవి రాష్ట్రానికి సంబంధించిన అంశాలు. కాబట్టి గృహనిర్మాణానికి సంబంధించిన పథకాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ పౌరులకోసం అమలు చేస్తాయి. అయితే కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన- పట్టణ ప్రాంతాలు ( పిఎంఏవై-యు) పథకం కింద రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆర్థిక సహాయం అందజేస్తుంది. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం 2015 జూన్ 25నుంచి మౌలిక సదుపాయాలతో కూడిన పక్కా గృహాలను పట్టణాల్లోని అర్హతగల లబ్ధిదారులకు అందజేస్తోంది. దాంతో దేశవ్యాప్తంగా పేద ప్రజలకు నివాసాలు లభిస్తున్నాయి.

డిమాండ్ ఆధారంగా అమలయ్యే పథకం పిఎంఏవై-యు. కాబట్టి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదు.

రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు సమర్పించిన ప్రతిపాదనల ప్రకారం 22-07-2024 నాటికి పిఎంఏవై-యు కింద 118.64 లక్షల ఇళ్లను మంజూరు చేయడం జరిగింది. మంజూరైన ఇళ్లలో 114.33 లక్షల ఇళ్ల నిర్మాణం మొదలైంది. వాటిలో 85.04 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తవ్వడంగానీ, లబ్ధిదారులకు అందించడంగానీ జరిగింది. మంజూరైన ఇళ్లకు కేంద్రప్రభుత్వ ఆర్థిక సాయం దాదాపు రూ.2 లక్షల కోట్లు వుంటుంది.

అందులో 1.64 లక్షల కోట్లను ఇంతవరకూ విడుదల చేయడం జరిగింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలవారీగా మంజూరైన ఇళ్ల వివరాలు, నిర్మాణం ప్రారంభమైనవాటి వివరాలు, పూర్తయిన వాటి వివరాలు, లబ్ధిదారులకు అందించినవాటివివరాలు, పిఎంఏవై-యు ప్రారంభమైన పుటినుంచీ కేంద్రప్రభుత్వ సాయం వివరాలను అనుబంధం -1లో చూడవచ్చు. పిఎంఏవై-యు కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల వారీగా పూర్తయిన ఇళ్ల వివరాలను, లబ్ధిదారులకు అందించిన వాటి వివరాలను, గత మూడు సంవత్సరాల్లో ప్రతి ఏడాది వారీగా లబ్ధిదారులకు అందించిన ఇళ్ల వివరాలను అనుబంధం 2లో చూడవచ్చు.

ఈ పథకం కాలపరిమితి గతంలో 31-03-2022వరకూ వుండేది. దీన్ని 31-12-2024వరకూ పొడిగించడం జరిగింది. రుణంతో సంబంధమున్న రాయితీ పథకం (సిఎల్ ఎస్ ఎస్) వర్టికల్ తప్పిస్తే నిధుల కేటాయింపు, అమలు విధానంలో ఎలాంటి మార్పులు లేవు.

# కొండచరియలు విరిగిపడిన వయనాడ్‌లో వాయుసేన సహాయక చర్యలు

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :కొండచరియలు విరిగిపడిన కేరళలోని వయనాడ్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) మొదటగా స్పందించి, ఎన్డీఆర్ఎఫ్ వంటి ఏజెన్సీలతో పాటు రాష్ట్ర యంత్రాంగం సమన్వయంతో జూలై 30న తెల్లవారుజాము నుంచి సహాయక చర్యలను చేపట్టింది.

కీలకమైన సామాగ్రి, సరుకుల సరఫరాతో పాటు తరలింపు చర్యల్లో ఐఏఎఫ్‌కు చెందిన రవాణా విమానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. బెయిలీ వంతెన, డాగ్ స్క్వాడ్స్, వైద్య సహాయం, సహాయక చర్యల కోసం అవసరమైన ఇతర పరికరాలు వంటి 53 మెట్రిక్ టన్నుల కీలకమైన సామాగ్రిని సీ-17 రవాణా చేసింది. దీనితో పాటు సహాయక సామగ్రి, సిబ్బంది తరలింపునకు ఏఎన్-32, సీ-130లను వినియోగిస్తున్నారు. ఐఏఎఫ్‌కు చెందిన ఈ విమానాలు సహాయ బృందాలు, నిర్వాసితులతో సహా 200 మందిని విపత్తు ప్రభావిత ప్రాంతానికి, అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు దోహదపడ్డాయి. వాతావరణం విమానాలు ఎగిరేందుకు సవాళ్లు విసురుతున్నప్పటికీ, హెచ్ఏడీఆర్ కార్యకలాపాలను ఐఏఎఫ్ చేపడుతోంది.

సహాయక చర్యల కోసం వాయుసేన వివిధ రకాల హెలికాప్టర్లను మోహరించింది. ఎంఐ-17, ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు (ఏఎల్ హెచ్) హెచ్ఏడీఆర్ ఆపరేషన్‌లు చేపట్టేందుకు ఉపయోగిస్తున్నారు. విస్తృతమైన ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ విపత్తులో చిక్కుకున్న వ్యక్తులను సమీప వైద్య కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలింపు, నిత్యావసర వస్తువుల పంపిణీని 31 జూలై 2024 సాయంత్రం వరకు వాయుసేన చేపట్టింది. సహాయక చర్యల్లో భాగంగా ఈ హెలికాప్టర్లు ప్రభావిత ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించింది. వారి సురక్షిత, తక్షణ రవాణాను వాయుసేన చూసుకుంటోంది.

# సుప్రీంకోర్టు తీర్పుపై.. 124 ఆల్విన్ కాలనీలో ఎస్సీ, ఎస్టీ నాయకుల సంబరాలు



హైదరాబాద్, ఆగష్టు 2 :మాదిగల చిరకాల కోరిక ఎస్సీ, ఎస్టీ ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున, తెలంగాణ రాష్ట్రంలోఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని ప్రకటించిన శుభసంధర్భంగా 124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఎల్లమ్మ బండ పీజేఆర్ నగర్ లో గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బ్యాండు బాజాలతో నృత్యాలు చేస్తూ.. టపాకాయలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు మాట్లాడుతూ?. ఏబీసీడీ వర్గీకరణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమర వీరులకు జోహార్లు తెలియజేశారు.

గత 30సంవత్సరాలుగా ఉద్యమపోరాటం చేసిన పలు సంఘాల నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పీఎల్ ప్రసాద్, నిక్కార్, బుల్లెట్ రవి, కొత్తదొడ్డి జాన్, సి.మల్లేష్, పాలడుగు జానయ్య, గుడ్ల శ్రీనివాస్, జగదీష్, కర్నాటక రాజు, సురేష్, మహేష్, గిరి, ఆదర్శ్, సాయి, ప్రసాద్, చంద్రయ్య, చెన్నయ్య, సిద్దయ్య, సామ్యూల్, కృష్ణ, ఇంత్యాజ్, సుధాకర్, స్టీవెన్, ప్రభాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గనుల నీటిని సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా సానుకూల మార్పు కోసం మైనింగ్ యొక్క పర్యావరణ ప్రభావాలను పరిష్కరించవచ్చు: శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :బొగ్గు, గనుల శాఖ మంత్రి, శ్రీ జి. కిషన్ రెడ్డి బొగ్గు, లిగ్నైట్ మైనింగ్ ప్రాంతాలలో సంప్రదాయిక నీటి వనరుల పునరుద్ధరణ కోసం సమగ్రమైన మార్గదర్శకాలను విడుదల చేశారు. బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనాల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా, శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ అమూల్యమైన సహజ వనరుగా నీటికి గల ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. గనుల నీటిని సమర్థంగా వినియోగించుకుంటే సానుకూల మార్పు కోసం ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ మైనింగ్ వల్ల కలిగే పర్యావరణ ప్రభావాలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ వినూత్నమైన విధానంలో, గనుల్లో నిండిన నీటిపై ఫ్లోటింగ్ రెస్టారెంట్స్ ఏర్పాటు చేయడం ద్వారా స్వయం సహాయక బృందాల (ఎస్.హెచ్.జి.ల) మహిళలకు సాధికారత కల్పించడం వంటి వివిధ వ్యూహాలు భాగంగా ఉన్నాయన్నారు. ఈ ఫ్లోటింగ్ రెస్టారెంట్స్ స్థానికంగా పర్యాటకాన్ని మెరుగుపరుస్తూ స్థానికుల కోసం కొత్త ఆర్థికపరమైన అవకాశాలను అందిస్తాయని పేర్కొన్నారు.

పారిశ్రామిక అవసరాలు, భూగర్భ జలాల పెంపు, అధునాతనమైన సాగు, చేపల పెంపకం సహా విభిన్న అవసరాల కోసం గని నీటిని పునరుపయోగించవచ్చని ఆయన పేర్కొన్నారు. మైన్ టూరిజం, ఫ్లోటింగ్ రెస్టారెంట్స్ వంటి కార్యక్రమాలు విలువైన వనరుగా గనుల నీటి బహుళ ఉపయోగాలను తెలియజేస్తాయని తెలిపారు. పునరావాస ప్రదేశాలలో నీటి వనరులను సృష్టించడం ద్వారా పర్యావరణ ప్రభావాలను తగ్గించడమే కాకుండా సమాజ సర్దుబాటు సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఈ సమగ్ర వ్యూహం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ నీటి వనరులను పునరుద్ధరించడం ద్వారా, బొగ్గు మంత్రిత్వ శాఖ ద్వారా మార్గనిర్దేశం చేయబడిన బొగ్గు, లిగ్నైట్ ప్రభుత్వ రంగ సంస్థలు స్థానిక జీవనోపాధిని మెరుగుపరచడం, స్థిరమైన అభివృద్ధికి తోడ్పడడం లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి.

బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే మాట్లాడుతూ, బొగ్గు గనుల సవాళ్లను ఎదుర్కోవడంలో వినూత్నమైన నీటి నిర్వహణ పద్ధతుల పాత్ర ముఖ్యమైనదని చెప్పారు. సమాజ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ సహా వివిధ ఉపయోగాల కోసం గనుల నీటిని పునరుపయోగించడం వనరుల నిర్వహణలో ప్రగతిశీల విధానాన్ని సూచిస్తుందని ఆయన తెలిపారు. వినోద ప్రదేశాలుగా, స్థానిక సంస్థల ప్రాజెక్టుల వంటి విలువైన ఆస్తులుగా గనుల నీటిని మార్చే కార్యక్రమాలకు ఊతమివ్వడం ద్వారా, పర్యావరణ నిర్వహణతో ఆర్థిక ప్రయోజనాలను సమతుల్యం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది అన్నారు.

బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనా మాట్లాడుతూ, బొగ్గు గనుల ప్రాంతాల పరిసరాల్లో తాగునీరు, సాగునీరు, చేపల పెంపకం, వాటర్ స్పోర్ట్స్ అలాగే మైన్ టూరిజం వంటి ప్రయోజనాల కోసం గనుల నీటిని పునరుపయోగించడంపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తుందన్నారు. అంతేగాకుండా, ఈ ప్రయత్నాలు జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఒక ఉప ఉత్పత్తిని బహుళ ప్రయోజన వనరుగా మార్చడం ద్వారా బొగ్గు మంత్రిత్వ శాఖ సుస్థిర అభివృద్ధి, సమాజ శ్రేయస్సు పట్ల తన నిబద్ధతను చాటుతున్నదని, బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణకు ఒక ప్రమాణాన్ని ఏర్పరుస్తుందని పేర్కొన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో నీటి వనరుల కీలక పాత్రను గుర్తెరిగి, బొగ్గు మంత్రిత్వ శాఖ బొగ్గు/లిగ్నైట్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సి.పి.ఎస్.యు.లు), జిల్లా పరిపాలనా యంత్రాంగాలు, గ్రామ పంచాయతీల సహకారంతో "బొగ్గు/లిగ్నైట్ మైనింగ్ ప్రాంతాలలో సాంప్రదాయిక నీటి వనరుల పునరుజ్జీవనం" పేరుతో ఒక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మిషన్ అమృత్ సరోవర్ (2022) మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించబడుతుంది అలాగే ఇది కోల్ ఇండియా లిమిటెడ్ (సి.ఐ.ఎల్.), ఎన్.ఎల్.సి ఇండియా లిమిటెడ్ (ఎన్.ఎల్.సి.ఐ.ఎల్) సహా బొగ్గు/లిగ్నైట్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సి.ఎస్.ఆర్ కార్యక్రమంగా సేవలందిస్తుంది.

ఈ ప్రాజెక్ట్ రాబోయే ఐదేళ్లలో (2024-25 ఆర్థిక సంవత్సరం నుండి 2028-29 ఆర్థిక సంవత్సరం వరకు) బొగ్గు, లిగ్నైట్ మైనింగ్ ప్రాంతాలు, వాటి పరిసర ప్రాంతాలలో కనీసం 500 నీటి వనరులను పునరుద్ధరించి, ఏర్పాటు చేయు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. లీజు కలిగి ఉన్న ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు నీటి వనరులను నిర్వహిస్తాయి, అయితే లీజు కలిగి ఉన్న ప్రాంతం వెలుపల ఉన్న నీటి వనరులను జిల్లా కలెక్టర్లు నిర్వహిస్తారు. ప్రతి కొత్త నీటి వనరు కనీసం 0.4 హెక్టార్ల చెరువు విస్తీర్ణాన్ని, సుమారు 10,000 క్యూబిక్ మీటర్ల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అదనంగా, ఈ ప్రాజెక్ట్ భారత ప్రభుత్వం యొక్క జల్ శక్తి అభియాన్‌తో అనుసంధానించబడి క్రియాశీలమైన, నిరుపయోగంలో ఉన్న గనుల నుండి నీటిని ఉపయోగించుకుంటుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో, బొగ్గు/లిగ్నైట్ గనులు గల రాష్ట్రాల్లోని 981 గ్రామాలకు సుమారుగా 4,892 లక్షల కిలోలీటర్ల శుద్ధి చేయబడిన గనుల నీటిని అందించారు. గత ఐదేళ్లలో 18,513 లక్షల కిలోలీటర్ల గనుల నీటిని సాగునీరు, త్రాగునీటి అవసరాలు సహా సమాజ వినియోగానికి అందుబాటులోకి తెచ్చారు.

సుస్థిరమైన మైనింగ్ పద్ధతులను అభివృద్ధి చేయడంలో ఈ మార్గదర్శకాల విడుదల కీలకమైన ముందడుగు అవుతుంది. సాంప్రదాయిక నీటి వనరుల పునరుజ్జీవనం కోసం స్పష్టమైన ఆదేశాలను అందించడం ద్వారా, బొగ్గు మంత్రిత్వ శాఖ సమర్థవంతమైన పర్యావరణ నిర్వహణ, సమాజ భాగస్వామ్యానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఈ మార్గదర్శకాలు కీలకమైన నీటి వనరులను పునరుద్ధరించడానికి నిర్మాణాత్మకమైన, ప్రభావవంతమైన విధానాన్ని నిర్ధారిస్తాయి, తద్వారా మైనింగ్ ప్రాంతాలలో పర్యావరణ సమతుల్యత, మెరుగైన జీవన నాణ్యతకు తోడ్పడుతాయి.

# సుప్రీం కోర్టు తీర్పు 20 ఏళ్లుగా పోరాటం విజయం

## -ఎంఆర్‌పిఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ

న్యూ ఢిల్లీ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: న్యాయం, ధర్మం కోసం 20 ఏళ్లుగా పోరాటం చేసి విజయం సాధించామనిఎంఆర్‌పిఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ సంతోషం వ్యక్తం చేశారు. ఎస్‌సి వర్గీకరణ అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మంద కృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు. వర్గీకరణ కోసం ఎంఆర్‌పిఎస్ 30 ఏళ్లుగా పోరాటం చేస్తోందన్నారు. మా జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ఎంఆర్‌పిఎస్ పోరాటం చేసిందని, 30 ఏళ్ల పోరాటంలో ఎంతోమంది ఎంఆర్‌పిఎస్ నేతలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఎంఆర్‌పిఎస్ నేతలకు ఈ విజయం అంకితమని, అనుకూల తీర్పునిచ్చిన జడ్జిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి చొరవ తీసుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు అని చెప్పారు. గతంలో ఉమ్మడి ఎపిలో ఎస్‌సి వర్గీకరణ చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని, ఎపిలో చంద్రబాబు నాయుడు సిఎంగా ఉండడంతో వర్గీకరణ అమలు జరుగుతోందని, ఎస్‌సి వర్గీకరణ చేసిన చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు వర్గీకరణ చేయకపోతే వేలాది ఉద్యోగాలు వచ్చేవి కాదన్నారు. న్యాయం బతికిందంటే ఆ రోజు చంద్రబాబు తీసుకొచ్చిన చట్టం వల్లే అని మంద కృష్ణ మాదిగ చెప్పారు.

# ఒంటరి మహిళలకు చేయూత - గొప్ప మానవీయ కార్యక్రమం

## -రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు

## - "ఆర్. జె. ఇన్స్పిరేషన్ హెల్పింగ్ హాండ్స్" సంస్థ "లోగో" ఆవిష్కరణ




హైదరాబాద్ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఊహించని పరిణామాలతో ఒంటరి మహిళలుగా జీవిస్తున్న వారి కుటుంబాలకు చేయూత అందించడం గొప్ప మానవీయ కార్యక్రమం అని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. బుధవారం నాడు రవీంద్ర భారతి, మినీ హాల్ లో "ఆర్. జె. ఇన్స్పిరేషన్ హెల్పింగ్ హాండ్స్" సంస్థ "లోగో" ను ముఖ్య అతిథిగా పాల్గొని డా|| వకుళాభరణం ఆవిష్కరించారు. సంస్థ అధినేత ఉమా కార్తీక్ సభాధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అతిథులు దైవజ్ఞ శర్మ, గోపి, కార్తీక్, కృష్ణవేణి, అనిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.జె. ఇన్స్పిరేషన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ తరపున ఒంటరి మహిళ, కుటుంబాలకు చెందిన 10 మంది విద్యార్థులకు స్కూల్ ఫీజుల నిమిత్తం ఒక్కొక్కరికి 5 వేల చొప్పున చెక్కులను డా|| వకుళాభరణం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డా|| వకుళాభరణం మాట్లాడుతూ సమాజానికి ఏదో చేయాలి అన్న తపన,ఎప్పుడు తీసుకోవడమే కాదు,మనం కూడా కొంత ఈ సమాజంకు తిరిగి ఇవ్వాల్సింది ఉంది,అది మన బాధ్యత అంటున్నారు కొద్ది మంది మహిళలు .హైదరాబాద్ రవీంద్ర భారతి లో నిర్వహించిన ఆర్ జే ఇన్స్పిరేషన్ హాండ్స్ లోగో ఆవిష్కరణ కార్యక్రమంకు బీసీ కమిషన్ సభ్యులు వకులభరణం కృష్ణ మోహన్ రావు ముఖ్య అతిధిగా పాల్గొని లోగోను ఆవిష్కరించారు.ఒంటరి మహిళల పిల్లకు సాయం చేయడం,సమాజాన్ని సమూలంగా మార్చే సేవని బీసీ కమిషన్ సభ్యులు వకులభరణం కృష్ణ మోహన్ రావు తెలిపారు.ఇక పై ఒంటరి మహిళలు నిరాశతో జీవించాల్సిన అవసరం లేదని సూచించారు. ఆర్ జే ఇన్స్పిరేషన్ హాండ్స్ సహకారం తీసుకోవాలి అని తెలిపారు.పిల్లకు ఫీ తో ప్రారంభమైనా ఈ సాయం భవిష్యత్తులో వైద్యము, వివాహాలకు కూడా సాయం చేయాలని ఆశించారు.. సమాజ కళ్యాణం కోసం పని చేసే వారికీ మొదట నిరాశ ఉంటుందని,ఐనా సేవ చేయడం ఆపొద్దని ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగిపోవాలని దిశా నిర్దేశం చేశారు.ధనికులు టాక్స్ మినహాయింపు కోసం అబతీ పేరుతో సేవ చేయడం షరా మాములు. కానీ మధ్య తరగతి కుటుంబం, లేదా దారిద్రరేకకు దిగువ కుటుంబం జీవనం సాగించడం కష్టం,ఇక ఒంటరి మహిళల పరిస్థితి చెప్పలేము. అటువంటి ఒంటరి మహిళలకోసం ఆర్ జే ఇన్స్పిరేషన్ హ్యాండ్స్ అండగా నిలిచి,జీవితం పై ఆశలను చిగురించేలా భరోసా నిస్తూ.. ముందుకు సాగెందుకు సాయం చేస్తున్నారు...

ఒంటరి జీవితల్లో వెలుగులు నిపుతున్న ఆర్ జే ఇన్స్పిరేషన్ హాండ్స్

ఒంటరితనం ఎంతో భయంకరం, ఇక డబ్బు లేకుండా మహిళా జీవించడంచాలా కష్టం.ఆయా మహిళకు చేయుతనిస్తూ,వారికి వారి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు. చదువుకునే పిల్లలు స్కూల్ ఫీ చెల్లిస్తూ వారి చేతులకు మరో నలుగురి చేతులు కలిపి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఒంటరి మహిళల సమస్యను ప్రత్యేక్షంగా చూసిన ఉమ కార్తీక్ తన కళ్ళలో నీళ్లకు కారణం కాగా.. అటువంటి మహిళల కోసం తన వంతుగా సాయం చేయాలని నిర్ణయం తీసుకోవడం, నేడు ఇలా పదుల సంఖ్యలో ఒంటరి మహిళకు అండగా నిలిచేలా చేసిందని ఆమె వివరణ ఇచ్చారు.సమాజంలో ఒంటరి మహిళలు ఎంతో మంది ఉన్నారని వారికి సాయం చేయనాలి ఆర్ జే ఇన్స్పిరేషన్ హాండ్స్ కి శ్రీకారం చుట్టినట్లు స్పష్టం చేశారు.తన మిత్రులతో కలిసి చేసే ఈ గొప్ప సాయంకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఒంటరి మహిళలకు చెక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ జే ఇన్స్పిరేషన్ హాండ్స్ సభ్యులు ఇతరులు పాల్గొన్నారు..

# వ్యవసాయ ఆర్థికవేత్తల 32వ అంతర్జాతీయ సమావేశాన్ని ఆగస్టు 3న ప్రారంభించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 2 :వ్యవసాయ ఆర్థికవేత్తల ముప్పై రెండో అంతర్జాతీయ సమావేశాన్ని (ఐసిఎఇ) శనివారం, అంటే 2024 ఆగస్టు 3న, న్యూ ఢిల్లీ లోని నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ సెంటర్ (ఎన్ఎఎస్‌సి) కాంప్లెక్స్ లో ఉదయం సుమారు 9 గంటల 30 నిమిషాలకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగించనున్నారు.

ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎకానమిస్ట్ స్ ఆధ్వర్యంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఏర్పాటయ్యే ఈ సమావేశాన్ని 2024 ఆగస్టు 2 - 7 తేదీల మధ్య నిర్వహించనున్నారు. ఐసిఎఇ కి భారతదేశం 65 సంవత్సరాల తరువాత వేదిక అవుతోంది.

ఈ సంవత్సరంలో నిర్వహించనున్న సమావేశానికి "ట్రాన్స్‌ఫర్మేషన్ టువార్డ్స్ సస్‌టేనబుల్ అగ్రి-ఫుడ్ సిస్టమ్స్" (స్థిరమైన వ్యవసాయ-ఆహార వ్యవస్థ వైపునకు మళ్ళడం) ఇతివృత్తంగా ఉంది. వాతావరణంలో మార్పులు, ప్రాకృతిక వనరుల క్షీణత, ఉత్పత్తి ఖర్చులు ఎగబాకుతూ ఉండడం, సంఘర్షణల వంటి ప్రపంచ సవాళ్ల నేపథ్యంలో స్థిర వ్యవసాయం సంబంధ ముఖ్యావసరాన్ని తీర్చుకోవాలనేది ఈ సమావేశం లక్ష్యంగా ఉంది. ప్రపంచంలో వ్యవసాయ రంగానికి ఎదురవుతున్న సవాళ్ళను గురించి ముందస్తు ఆలోచనలను చేస్తూ, వాటి పరిష్కారానికి తగిన దృష్టి కోణాన్ని అనుసరిస్తున్న భారతదేశ వైఖరితో పాటు వ్యవసాయ సంబంధ పరిశోధనలు, వ్యవసాయ సంబంధ విధానాలలో దేశం సాధిస్తున్న పురోగతిని ఈ సమావేశం ప్రముఖంగా చాటిచెప్పనుంది.

యువ పరిశోధకులు, అగ్రగామి వృత్తి నిపుణులు వారి కృషిని వెల్లడించేందుకు ప్రపంచంలో తమ సమకాలికులతో సంబంధాలను ఏర్పరచుకొనేందుకు ఒక వేదికగా ఐసిఎఇ 2024 ఉంటుంది. ఈ సమావేశం పరిశోధక సంస్థలకు, విశ్వవిద్యాలయాలకు మధ్య భాగస్వామ్యాలను బలపరచడం, జాతీయ, ప్రపంచ స్థాయిలలో విధాన రూపకల్పనను ప్రభావితం చేయడంతో పాటు భారతదేశంలో డిజిటల్ అగ్రికల్చర్, స్థిరమైన వ్యవసాయ-ఆహార వ్యవస్థల పరంగా నమోదైన పురోగతి లు సహా వ్యవసాయ రంగంలో భారతదేశం సాధిస్తున్న పురోగతిని కళ్ళకు కట్టడం సమావేశం లక్ష్యంగా ఉంది. సుమారు 75 దేశాల నుంచి సుమారు ఒక వేయి మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

# మద్యం పాలసీలో తప్పు చేస్తే ఎటువంటి శిక్షకైనా రెడీ

## -మాజీ మంత్రి నారాయణస్వామి

అమరావతి ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మద్యం పాలసీ లో ఎటువంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు.

గురువారం ఆయన తిరుపతిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం పాలసీలో తాను తప్పు చేసినట్లు రుజువు చేస్తే ఎటువంటి శిక్షకైనా సిద్ధమేనని సవాల్ చేశారు.ఏపీలో కొత్త బ్రాండ్‌లన్ని చంద్రబాబే తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి నిధులు ఓర్చుకోలేక పోయారని అన్నారు. పేదవారికి న్యాయం జరిగితే సహించలేక వైసీపీ పాలనపై తప్పుడు ఆరోపణలు చేశారని, అధికారంలోకి రావడానికి అనేక అబద్దాలు ఆడారని ఆరోపించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కులాల కార్డును ముందుకు తీసుకువచ్చి అధికారం చేపట్టారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే అమ్మ ఒడి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్య అందించాలని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

## -విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేసుకోవచ్చు

న్యూ డిల్లీ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేసుకోవచ్చని సిజెఐ జస్టిస్ డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఉపవర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందంటూ తీర్పు వెలువరించింది. సుప్రీం తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు తదుపరి మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సూచించింది. 6:1 మెజారిటీతో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఉపవర్గీకరణ సాధ్యం కాదంటూ జస్టిస్ బేలా త్రివేది ఒక్కరే వ్యతిరేకించారు. పంజాబ్ ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల నుంచి ఎంఆర్‌పిఎస్ ఉపవర్గీకరణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఉపవర్గీకరణ చేయవద్దన్న నాటి తీర్పును కోర్టు కొట్టివేసింది. 2004లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది.



# స్థానిక సంస్థల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాం

## -ప్రజాప్రతినిధులతో చర్చించకుండా జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించడం ఏకపక్షం

## -బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్



హైదరాబాద్ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ప్రజాభిప్రాయానికి భిన్నంగా, అధికారాన్ని కేంద్రీకృతం చేయాలనే యావతో కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తున్న స్థానిక సంస్థల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తున్నట్లు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తెలిపారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్స్ పర్ట్స్ సూచనలు తీసుకోకుండా, సంబంధిత ప్రజాప్రతినిధులతో చర్చించకుండా జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడంపై ఆయన తప్పుబట్టారు. 15 ఏళ్ల కిందట హైదరాబాద్ శివారులోని ఉప్పల్, కాప్రా, కుత్బుల్లాపూర్ లాంటి మున్సిపాలిటీలను విలీనం చేసినా.. ఇప్పటికీ ఆ ప్రాంతాలు రాష్ట్ర ప్రభుత్వం అసమర్థ పాలనతో అభివృద్ధి కుంటుపడిందని మండిపడ్డారు. మరోవైపు హైదరాబాద్ మహానగరం మ్యాన్ హోల్ మరణాలకు, కుంగిన నాలాలకు, కూలుతున్న భవనాలకు, కాలుతున్న భవనాలకు, ట్రాఫిక్ జాంలకు, కాలుష్య కోరలకు కేరాఫ్ గా మిగిలిందన్నారు. రాష్ట్రంలోని గత ప్రభుత్వాలతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు.. నిజాం కాలంనాటి భూగర్భ డ్రైనేజీని ఆధునీకరించకపోవడం, చెరువుల పూడిక తీయకుండా, సుందరీకరణ జరపకుండా నిర్లక్ష్యం చేశాయని ఫైరయ్యారు. కేవలం ఆదాయాన్ని కొల్లగొట్టాలనే దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ శివారులోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను విలీనం చేయాలనే ఆలోచన చేస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు. స్థానిక సంస్థల విలీనానికి ముందు స్థానిక ప్రజల నుంచి ప్రజాభిప్రాయం తీసుకోవాలని, సంబంధిత ప్రజాప్రతినిధులతో చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా సంబంధిత పార్లమెంటు సభ్యులు, స్థానిక పురపాలక సంఘాల చైర్మన్లు, కౌన్సిలర్లతో, కార్పొరేషన్ల మేయర్లు, కార్పొరేటర్లతో విస్తృత స్థాయి చర్చలు జరిపిన తర్వాతే అడుగు ముందుకు వేయాలని హెచ్చరించారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా, పౌరుల నిర్ణయాలకు అనుగుణంగా భారతీయ జనతా పార్టీ తగిన కార్యాచరణతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించేలా..ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న అనేక ప్రాంతాలను విలీనం చేయాలని ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. 33 గ్రామపంచాయతీలు, 20 పురపాలక సంఘాలు, 8 కార్పొరేషన్లు, 61 పారిశ్రామిక వాడలు, కంటోన్మెంట్ బోర్డు.. ఇవన్నింటినీ కలిపి ప్రత్యేక గ్రేటర్ సంస్థగా రూపొందించాలని కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు ప్రకటనలు చేస్తున్నారన్నారు..గత ప్రభుత్వాల మాదిరిగానే అదే పద్ధతిలో ప్రజల ఆలోచనలకు భిన్నంగా జీహెచ్ఎంసీ పరిధి విస్తరణ కోసం స్థానిక సంస్థల విలీన ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామన్నారు..ప్రస్తుత జీహెచ్ఎంసీలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. చాలా మున్సిపాలిటీల్లో ఇప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, వీధి దీపాల సమస్యలు, ప్రజా సమస్యలతో సతమతమవుతున్నారు. నిజాం కాలంనాటి భూగర్భ డ్రైనేజీని ఆధునీకరించలేదు. చెరువులను అభివృద్ధి చేయలేదు. సుందరీకరణ జరవలే.. పూడికలు తీయని పరిస్థితి. చిన్నపాటి వానలకే అనేక చోట్ల ప్రతీనిత్యం మోకాళ్లలోతు నీళ్లు, పొంగుతున్న డ్రైనేజీలు దర్శనమిస్తున్నాయి.

15 ఏళ్ల కిందట హైదరాబాద్ శివారులోని ఉప్పల్, కాప్రా, కుత్బుల్లాపూర్ లాంటి మున్సిపాలిటీలను విలీనం చేశారు. కాని, ఆ ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. పురపాలక సంఘాల్లో ప్రజాప్రతినిధులు, పౌరులు వ్యతిరేకించినా నాటి ప్రభుత్వం అధికార బలంతో ఆయా మున్సిపాలిటీలను విలీనం చేసింది.

పస్తుత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ అధికారాన్ని కేంద్రీకృతం చేయాలనుకుంటోంది. కేవలం ఆదాయాన్ని కొల్లగొట్టే దురుద్దేశంతో వ్యవహరిస్తోంది.

వ్యవసాయ భూములు, ఉద్యానవనాలు, కులవృత్తుల సంఘాల ఆశలను అడియాసలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు.. హైదరాబాద్ నగర అభివృద్ధిపై గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది.

పజలపై పన్నులు బాదుతూ, స్థానిక సంస్థల అభివృద్ధిని మర్చిపోవడం బాధాకరం. స్థానిక సంస్థల విలీనానికి ముందు స్థానిక ప్రజల నుంచి ప్రజాభిప్రాయం తీసుకోవాలి.

సంబంధిత ప్రజాప్రతినిధులతో చర్చించాలి. పార్లమెంటు సభ్యులు, స్థానిక పురపాలక సంఘాల చైర్మన్లు, కౌన్సిలర్లతో, కార్పొరేషన్ల మేయర్లు, కార్పొరేటర్లతో చర్చించిన తర్వాతే అడుగు ముందుకు వేయాలని డిమాండ్ చేసారు.

# ఋణమాఫీ కాలేదని అన్నదాతల్లో ఆందోళన.. బ్యాంకుల ఎదుట ఆందోళనలు



నిజామాబాద్, ఆగష్టు 2 :కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటుండగా మరోపక్క అర్హులైన రైతులు రుణమాఫీ అందకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుక వచ్చిన రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ పథకం పలువురు రైతులకు రుణ మాఫీ కావడం లేదు. దీంతో సదరు రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ నానా అవస్థలు పడుతున్నారు. తాజాగా నిజామాబాద్‌జిల్లా రెంజల్ మండలంలో రుణమాఫీ కాలేదని రైతు కుటుంబాలు ఆందోళనకు దిగాయి. రెంజల్ మండల కేంద్రంలో కెనరా బ్యాంక్ ఎదుట తాము తీసుకున్న రుణాలకు మాఫీ ఎందుకు కాలేదు అంటూ బ్యాంకు ముందట రైతులు బైఠాయించారు. బ్యాంక్ అధికారులను అడిగితే తమకేమీ సంబంధం లేదని చెప్తున్నారని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించి రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉద్యాన సాగుకు ప్రోత్సాహం -40 శాతం రాయితీ

నల్గొండ, ఆగష్టు 2 :ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా రాయితీలు ప్రకటించింది. నల్లగొండ జిల్లాలో నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో ఉద్యానవన పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహించడానికి ప్రణాళిక రూపొందించింది. ఆసక్తి గల రైతులను వీటిని వినియోగించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులు కోరుతున్నారు. సాగుకు అయ్యే ఖర్చులో 40 శాతం రాయితీగా వస్తుంది.

నల్లగొండ జిల్లాలో 357 హెక్టార్ల ఉద్యానవన పంటలకు రాయితీలు ఇవ్వడానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. బొప్పాయి, అరటి , మామిడి , జామ, సీతాఫలం , నిమ్మ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆమ్లా , పనస , నేరేడు , చింతతోపాటు సంకరజాతి కూరగాయల సాగుకు ప్రభుత్వం రాయితీలను కల్పించనున్నది. రాయితీపై మొక్కలు సరఫరా, డ్రిప్‌సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనుంది.

జిల్లాలో బొప్పాయి 40 హెక్టార్లు, అరటి 10, మామిడి 10 , జామ 45 , సీతాఫలం 15 , నిమ్మ 40 , బత్తాయి 136, డ్రాగన్ ఫ్రూ ట్ 26 , అవకడో 2.70 , ఆమ్లా 8 , పనస 2 , నేరేడు 5 , చింత 5 హెక్టర్లకు రాయితీలు ఇవ్వడానికి లక్ష్యంగా నిర్ణయించారు. అలాగే హైబ్రిడ్ కూరగాయలు 25 హెక్టార్లు, పూల సాగు 10 , పాత తోటల పునరుద్ధరణ 60 , మల్చింగ్ 215 హెక్టార్లను టార్గెట్ ఇచ్చారు.

నాన్ ఆయకట్టు ప్రాంతాల్ల రైతులకు ప్రాధాన్యం

నీటి వినియోగం తక్కువగా ఉండే పండ్ల తోటల సాగు వల్ల రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ప్రభుత్వం ఆలోచన. జిల్లాలో దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, పెద్దవూర, చింతపల్లి, మునుగోడు, మర్రిగూడ, నాంపల్లి తదితర మండలాలు నాన్ ఆయకట్టు మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యానవన పంటలకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుంది.






# 15 వేల ఉద్యోగులను తొలగించిన ఇంటెల్

## -ముందున్నాయి గడ్డు రోజులన్న సిఈవో

న్యూ డిల్లీ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇంటెల్ సీఈఓ పాట్ గెల్సింగర్ డబ్బును ఆదా చేయడం , ఖర్చులను తగ్గించుకోవడం కోసం కంపెనీ ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ఉద్యోగులకు తెలియజేశారు. 2025 నాటికి కంపెనీ ౹10 బిలియన్ల పొదుపును అందించాలని యోచిస్తోందని, దీని కారణంగా మొత్తం శ్రామికశక్తిలో 15% తగ్గుతోందని ఉద్యోగులందరికీ మెమోలో పాట్ గెల్సింగర్ వెల్లడించారు. ఇంటెల్ అర్హతగల ఉద్యోగుల కోసం మెరుగైన పదవీ విరమణ ఆఫర్‌ను ప్రకటించింది మరియు వచ్చే వారం స్వచ్ఛంద నిష్క్రమణల కోసం అప్లికేషన్ ప్రోగ్రామ్‌ను అందజేస్తుంది. అతను ఇలా తెలిపాడు, "నేను పంచుకోవడానికి ఇది బాధాకరమైన వార్త. మీరు చదవడం మరింత కష్టమవుతుందని నాకు తెలుసు. ఇంటెల్‌కి ఇది చాలా కష్టతరమైన రోజు, ఎందుకంటే మేము మా కంపెనీ చరిత్రలో అత్యంత పర్యవసానంగా కొన్ని మార్పులు చేస్తున్నాము."

# మడకశిరలో ప్రభుత్వ కార్యక్రమాన్ని బాబు సాదాసీదాగా నడిపించారు

## -ఆనందం వ్యక్తం చేసిన రఘువీరా రెడ్డి

అమరావతి ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిరలో గురువారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమాన్ని హంగు ఆర్భాటం లేకుండా సాదాసీదాగా సిఎం చంద్రబాబు నాయుడు నడిపించడం చాలా సంతోషంగా ఉందని మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రఘువీరా రెడ్డి తెలిపారు. శుక్రవారం రఘువీరా రెడ్డి మీడియాతో మాట్లాడారు. బలవంతపు జన సమీకరణ చేయకుండా రైతులు, ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొనే ప్రయత్నం ఆహ్వానించదగినదని కొనియాడారు. గత పది ఏళ్లుగా మడకశిరలో అనేక సమస్యలు అపరిష్కృతంగా వున్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించే శక్తిని దేవుడు చంద్రబాబుకు ఇవ్వాలన్నారు. కేరళలో భారీ వర్షాలు కురవడంతో వరదలలో వందలాది మంది చనిపోవడంతో ఆ రాష్ట్రంలో భయానక పరిస్థితి నెలకొందన్నారు. వయనాడ్ లో జలప్రళయం సృష్టించిడంతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీ పర్యటించారు. రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను రాహుల్ పరామర్శించి ఓదార్చారు. విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా బాధితులకు అండగా ఉండాలని రాహుల్ పిలుపునివ్వడం గొప్పవిషయమన్నారు.

# యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్‌గా ప్రీతీ సూదన్

న్యూ డిల్లీ ఆగష్టు 2(ఎక్స్ ప్రెస్ న్యూ స్);యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) చైర్‌పర్సన్‌గా కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి ప్రీతీ సూదన్‌ను కేంద్రం బుధవారం నియమించింది. ఈ నెల మొదట్లో యుపిఎస్‌సి చైర్మన్ పదవికి మనోజ్ సోని రాజీనామా చేయడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం యుపిఎస్‌సి సభ్యురాలిగా ఉన్న ప్రీతి సూదన్ గురువారం చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. యుపిఎస్‌సి చైర్‌పర్సన్‌గా ప్రీతి సూదన్ నియామకాన్ని రాష్ట్రపతి ఆమోదించినట్లు ఒక అధికారి ప్రకటన తెలిపింది. ఆమె 2025 ఏప్రిల్ 29 వరకు ఈ పదవిలో కొనసాగతారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన ప్రీతి సూదన్ వివిధ హోదాలలో పనిచేశారు. కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిగా 2020 జులై వరకు మూడేళ్ల పాటు ఆమె పనిచేశారు. సోని రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు.

# భారీగా పట్టుబడ్డ గంజాయి.. పోలీసుల అదుపులో ఆరుగురు



ఖమ్మం, ఆగష్టు 2 :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామ శివారు ప్రాంతమైన పల్లె పకృతి వనం ప్రాంతంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు బూర్గంపాడు మండల ఎస్సై రాజేష్, టాస్క్ ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు సుమన్, ప్రవీణ్ వారి బృందం నేతృత్వంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం ఉన్న మూడు కార్లు అదుపులో తీసుకొని విచారించగా సుమారు 250కేజీల గంజాయి పట్టుబడింది.

మూడు కార్లల్లో ఉన్న 12మంది వ్యక్తుల్లో ఆరుగురైన సారపాకకు చెందిన రావులపల్లి ప్రతాపు, ములగాడ అన్వేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోనసీమ జిల్లాకు చెందిన కాదతనోజు హర్షిత్, హైదరాబాద్ కు చెందిన కిషన్ కుమార్ దాస్, బంజారాహిల్స్ కి చెందిన బావికాడి శ్రీనివాస్ లను అదుపులో తీసుకొని విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టి కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. మిగతా ఆరుగురు కోసం గాలింపు చర్యలు చేపట్టామని డి.ఎస్.పి సతీష్ కుమార్, సిఐ వినయ్ కుమార్, ఎస్సై రాజేష్ లు తెలిపారు.

# విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బెదిరింపులను ధీటుగా ఎదుర్కోవాలి : వైఎస్ జగన్

అమరావతి, ఆగష్టు 2 : ఉమ్మడి విశాఖపట్నం స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ బెదిరింపులకు పాల్పడే అవకాశవుందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి విశాఖ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లోనూ మెజారిటీ లేకపోయినా ప్రలోభాలు, బెదిరింపులు, కుట్రలతో గెలిచేందుకు చేసే ప్రయత్నాలను ధీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

విశాఖ జిల్లాలో వైసీపీకి భారీ మెజార్టీ ఉందని పేర్కొన్నారు. గెలువలేమని తెలిసినా కూడా చంద్రబాబు అభ్యర్థిని నిలబెడుతారని అన్నారు. పార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ పేరును ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. అభ్యర్థి గెలుపు కోసం పార్టీ నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని సూచించారు.

వైసీపీకి చెందిన విశాఖ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డ ఆయనపై వైసీపీ అధిష్టానం ఫిర్యాదుతో మండలి చైర్మన్ ఆయనపై అనర్హత వేటు వేశారు. దీంతో ఇక్కడ ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుంది.

ఆగస్టు 6న ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదల, అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరణ, ఆగస్టు 13 వరకు నామినేషన్లకు ఆఖరు గడువు , 14న పరిశీలన, 16న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల అధికారులు వివరించారు. ఆగస్టు 30న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపఎన్నిక, సెప్టెంబరు 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని వివరించారు. ఉమ్మడి విశాఖపట్నం ఉమ్మడి జిల్లా పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్ సభ్యులు కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు

# పొంగిపొరిలిన కట్టలేరు వాగు

## ఆంధ్ర- తెలంగాణ మధ్య నిలిచిపోయిన రాకపోకలు



హైదరాబాద్ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): తెలుగు రాష్ట్రాల మధ్య కీలక రహదారి?కానీ ఎన్టీఆర్ జిల్లాలో కట్టలేరు వాగు పొంగడంతో ఆ దారి మార్గం దుర్గమం అయింది. రోజూ వందలాది వాహనాలు ఆ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. దంచి కొట్టిన వానకు కట్టలేరు పొంగింది. నీరు రోడ్డు మీదకు రావడంతో రాకపోకలు స్థంభించాయి. ఇక కనీసం పది రోజులైన పడుతుంది ఆ దారి తిరిగి తెరుచుకోడానికి. దశాబ్ద కాలంగా కడతామంటూ తాత్సారం చేస్తున్న వంతెన నిర్మాణం ఇప్పటికీ జరగడం లేదు.

# జన్వాడను మున్సిపాలిటీ చేయవద్దు.. జిహెచ్ఎంసిలో కలపొద్దు..



హైదరాబాద్, ఆగష్టు 2 :జన్వాడ గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చడం కానీ, జిహెచ్ఎంసి లో కలపడం కానీ చేయనే చేయవద్దని గ్రామంలో నిరసనలు ప్రారంభమయ్యాయి.

గ్రామ సమస్యలను పరిష్కరించకుండా గ్రామ ప్రజలపైన భారం వేసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లు శుక్రవారం పెడతారనే సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని వారు ఈ నిరసన ప్రక్రియకు పూనుకున్నారు.

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మాట్లాడుతూ తమ గ్రామాన్ని మునిసిపాలిటీగా మార్చమని లేదా జిహెచ్ఎంసి లో కలపమని కానీ మేమేమైనా అడిగామా.. తాము అడిగిన తమ సమస్యలను పరిష్కరించండి అంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. మొత్తం మీద శంకర్ పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో నిరసనల కార్యక్రమం ఉవ్వెత్తున ప్రారంభమైంది.

గ్రామంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ఎంపీపీ బీర్ల నరసింహ, భారతీయ జనతా పార్టీ యువ నాయకుడు వెంకటేష్, మాజీ వార్డ్ మెంబర్ అశోక్, నాగరాజు, అశోక్, తదితరులు ఉన్నారు.

# కనకదుర్గమ్మకు సీతారాముల సారే

## -సమర్పించిన భద్రాచలం ఈవో ఎల్. రమాదేవి

## -స్వాగతం పలికిన ఈవో కె ఎస్ రామారావు

అమరావతి, ఆగష్టు 2 :ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత ప్రాచుర్యం పొందిన విజయవాడలోని



ఇంద్రకీలాద్రిపై ఉన్నశ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కొలువైయున్న కనకదుర్గమ్మకు భద్రాద్రి సీతారాముల సారెను సాంప్రదాయ బద్ధంగా ఈవో రమాదేవి సమర్పించారు. ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానంలో శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించుటలో భాగంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్రం, భద్రాచలం నుండి భద్రాచలం లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహనాధికారి ఎల్.రమాదేవి, ఆలయ అధికారులు అమ్మవారి ఆలయమునకు విచ్చేయగా వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఈవో కేఎస్ రామారావు అమ్మవారి దర్శనం కల్పించారు.

